

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## కొనుగోలు కేంద్రాల్లోనే
# ధాన్యం విక్రయించాలి

### కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, అక్టోబర్,1(నమస్తే తెలంగాణ) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వానకాలం సీజన్ (2024-25) ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో భాగంగా జిల్లాలోని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, వీవోలు, టీఎస్‌సీఎస్ చైర్మన్లు, సీఈఓలు, రైస్ మిల్లర్స్ మం డల అధ్యక్షులు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్స్, వ్యవసాయ శాఖ ఏడిఏలు, మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సన్న రకం 44,534 హెక్టార్లలో సాగు చేసినట్లు, 57, 432 హెక్టార్లలో దొడ్డు రకం సాగు చేసినట్లు చెప్పారు. జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలుకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అక్టోబర్ మూడో వారం నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. లక్ష గన్ని బ్యాగ్స్ అవసరం ఉంటాయని వివరించారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించి మద్ధతు ధర పొందాలన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, డీఎం సివిల్ సప్లై హరికృష్ణ, పౌరసరఫరాల అధికారి సురేశ్ రెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, డీసీవో కరుణ, అధికారులు పాల్గొన్నారు.

## తూప్రాన్, రామాయంపేటకు కాయకల్ప అవార్డులు



కాయకల్ప అవార్డుకు ఎంపికైన తూప్రాన్ సీహెచ్‌సీ దవాఖాన



ఉత్తమ కాయకల్ప అవార్డుకు ఎంపికైన రామాయంపేట సీహెచ్‌సీ దవాఖాన

రామాయంపేట, అక్టోబర్ 1 : మెదక్ జిల్లాలోని సీహెచ్‌సీ ప్రభుత్వ దవాఖానలు తూప్రాన్, రామాయంపేట ఉత్తమ కాయకల్ప అవార్డులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసినట్లు తూప్రాన్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్, రామాయంపేట దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి మంగళవారం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం కాయకల్పశాఖ బృందం వెల్లడించినట్లు తెలిపారు. మెదక్ జిల్లాలోనే రెండు దవాఖానలు ఎంపిక కావడం విశేష మన్నారు.

## ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేద్దాం

రామాయంపేట, అక్టోబర్ 1: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది రామాయంపేట మండల ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు ప్రతిష్టలను తీసుకొస్తానని నూతన మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన అయిత శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట మండల వనరుల కేంద్రంలో విధులను చేపట్టిన ఎంఈవోను మండల హెచ్‌ఎంలు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంఈవో విలేకరులతో మాట్లాడారు. రామాయంపేట మండల వ్యాప్తంగా విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు చెప్పేలా చర్యలు చేపడుతానన్నారు. హెచ్‌ఎంలు నాగేందర్, కరుణశ్రీ, జయమ్మ, రాంచంద్రా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎంఐఎస్‌లు సంతోశ్, శంకర్, రజిత, రాజు, రవీందర్ తదితరులు ఉన్నారు.

## మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికీ అందాలి



మిషన్ భగీరథ కరదీపికను ఆవిష్కరిస్తున్న అధికారులు

రామాయంపేట, అక్టోబర్ 1: మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ అందేలా ప్రతి ఒక్క వాటర్‌మెన్ చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మెదక్ జిల్లా ఈఈ గ్రిడ్ అధికారి నాగభూణం, డీవైఈఈ పల్లవి, రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం ముందుగా భగీరథ కరదీపికలను ఆవిష్కరించి వాటర్‌మెన్ సహాయకులకు శిక్షణను ఇచ్చారు. రామాయంపేట, నిజాంపేట మండలాలకు చెందిన వాటర్ మెన్లు శ్రద్ధతో పనులు చేసి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలాన్నారు. రామాయంపేట మిషన్ భగీరథ ఏఈఈ కిరణ్ కుమార్, ఏఈ గ్రిడ్ తిరుమలేశ్ తదితరులు ఉన్నారు.

## ప్రారంభమైన శిక్షణా తరగతులు

చిన్నశంకరంపేట,అక్టోబర్ 1 : చిన్నశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో మంచినీటి సహాయకుల శిక్షణా తరగతులను ప్రారంభమైనట్లు ఎంపీడీవో దామోదర్ మంగళవారం తెలిపారు. ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులుంటాయని, సింగిల్, త్రీఫేజ్ మోటర్ల మరమ్మతులు, పగిలిన నీటి పైపులైనులు అతికించుట వంటి వాటిపై శిక్షణ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏఈ భిక్షపతి, శిక్షకుడు శ్రీనివాస్, ఎంపీవో గిరజ ఉన్నారు.

## బాధితులకు మాజీ జడ్పీటీసీ చేయూత



శబాష్‌పల్లిలో ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా

శివ్వంపేట, అక్టోబర్ 1 : మృతి చెందిన రెండు కుటుంబాలకు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తా ఆర్థిక సాయాన్ని అందజేసి చేయూతనందించారు. శివ్వంపేట మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన జోడు సాయినాథ్, పడిగే బాబు కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ. 10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అదే గ్రామంలో జోడు వెంకటేశ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచ్ పార్వతీసత్యం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చందనబోయిన భిక్షపతి, ఆకుల విజయ్, మారకంటి మధు, ఆకుల శ్రీనివాస్, చందనబోయిన బాలేష్, దాసరి మహేశ్, పాండగారి వెంకటేశ్, మనోహర్, అరవింద్, షేక్ ఇస్మాయిల్, షేక్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారికి సన్మానం



విద్యాధికారి మధుమోహన్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 1: హవేళి ఘనపూర్ మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన మధుమోహన్‌ను మంగళవారం పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు సుభాష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్, రఘుబాబు, శ్రీహరి, సంగమేశ్వర్, సత్యం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



రామాయంపేట : మంజీరా విద్యాలయంలో బతుకమ్మలు ఆడుతున్న విద్యార్థినులు, టీచర్లు



నిజాంపేట : చల్మెడలో బతుకమ్మలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు

# పూల సంబురం

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను మంగళవారం ముందస్తుగా మెదక్ జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆడబిడ్డలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆడిపాడారు. అనంతరం సమీప చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

*-మెదక్ జిల్లా నెట్‌వర్క్, అక్టోబర్ 1*



చిన్నశంకరంపేట: చందాపూర్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మలను నిమజ్జనానికి తరలిస్తున్న విద్యార్థులు



నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ పేరుస్తున్న విద్యార్థినులు



టేక్మాల్ : మోడల్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



పాపన్నపేట ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలు



మెదక్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో బతుకమ్మ అడుతున్న విద్యార్థినులు

## నల్లబ్యాడ్జీలతో ఏఈవోల నిరసన



తూప్రాన్ : గుండ్రెడ్డిపల్లి రైతు వేదిక వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఈవోలు

తూప్రాన్, అక్టోబర్ 1 : డిజిటల్ క్రాప్ సర్వే యాప్ విధానంలో ఉన్న సమస్యల గురించి వారం రోజులుగా ఉన్నతాధికారులకు తెలియజేశారు. గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు విధులకు హాజరు కానట్లుగా పరిగణించినందుకు నిరసనగా తూప్రాన్ మండల వ్యవసాయ విస్తరణ అధికారులు మంగళవారం గుండ్రెడ్డిపల్లి రైతు వేదికలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జేఏసీ పిలుపు మేరకు మండలంలోని గుండ్రెడ్డిపల్లి రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఏఈవోలు సంతోశ్, సింధు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

**రేగోడ్‌లో..**

రేగోడ్,అక్టోబర్ 1: వ్యవసాయ విస్తరణ అధికారుల నల్లబ్యాడ్జీల ప్రదర్శన చేసినట్లు ఏఈవో సునీల్ తెలిపారు. ప్రభుత్వం కొత్తగా రైతుల భూముల్లోని పంటలను డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో నమోదు చేయాలని సూచించడంతో ఆయాప్‌లో ఉన్న సమస్యలను అధికారులకు తెలియజేసిన సమస్యలను పరిష్కరించకపోవడంతో నల్లబ్యాడ్జిల ప్రదర్శన చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారుల సంఘం అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి ప్రశాంత్ పిలుపు మేరకు ఈ నల్ల బ్యాడ్జిల ప్రదర్శన చేసినట్లు తెలిపారు. ఏఈవోలు సునీల్ కుమార్, మహేశ్, కావ్య, భూలక్ష్మి పాల్గొన్నారు.

**వెల్దుర్తిలలో..**

వెల్దుర్తి, అక్టోబర్ 1 : రైతు వేదికలో జరిగే రైతు నేస్తాం వీడియో సమావేశానికి మంగళవారం వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారులు నల్ల బ్యాడ్జిలు ధరించి హాజరయ్యారు. నిరసనలో ఏఈవోలు గౌతమి, ఉత్తమ్‌కుమార్, మజీద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 1 : స్వచ్ఛతా హీసేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు, వాటర్ సప్లై సిబ్బందికి మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ పార్థసారధి ఆరోగ్య పరీక్ష లు నిర్వహించారు. బీపీ, షుగర్, సీబీపీ, ఆర్‌ఎఫ్‌టీ, ఎల్‌ఎఫ్‌టీ రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ డీఈ మహేశ్, హెల్త్ అసిస్టెంట్ మహేశ్, శానిటేషన్ జవాన్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

## రెండు ఇండ్లల్లో చోరీ

నిజాంపేట, అక్టోబర్1: తాళం వేసిన ఇండ్లను టార్గెట్‌గా చేసుకొని తాళలు పగులగొట్టి నగలు, నగదును గుర్తు తెలియని దుండగులు అపహరించిన ఘటన నిజాంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన రేగుల ఎల్లవ్వ సోమవారం ఇంటికి తాళం వేసి కూతురి ఇంటికి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన మరో గృహిణి పంపరి స్వరూప ఆదివారం ఇంటికి తాళం వేసి నిజాంబాద్ బంధువుల ఇంటికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దుండగులు ఇండ్లకు వేసిన తాళాన్ని పగలగొట్టి 2.5 తులాల బంగారు నగలు, 20 తులాల వెండిని అపహరించారు. బాధితులు మంగళవారం ఇంటికి వచ్చి తాళం తీయగా, చిందర వందరగా పడి ఉన్న బట్టలు, వస్తువులను చూసి దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కౌడిపల్లి, అక్టోబర్ 1 : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పాంపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాదె నర్సింహులు (30) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ తరుణంలో అతడి భార్య ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపానికి గురై మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి గాదె యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## వృద్ధులను గౌరవించాలి



నర్సాపూర్‌లో వృద్ధులకు బట్టలను పంపిణీ చేస్తున్న చైర్మన్ నర్సింగ్ సాగర్

నర్సాపూర్, అక్టోబర్ 1: ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ సూచించారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుకలు విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వహకురాలు అపర్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి అనిత, తెలంగాణ స్టేట్ డైరెక్టరేట్ నుంచి ఏడీ రమేశ్, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, ఎంపీడీవో మధులత, ముఖ్య అతిథులుగా హాజరై వృద్ధులను సన్మానించారు. ఇంటర్‌నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ తెలంగాణ జనరల్ సెక్రటరీ మహ్మద్ జహీర్ ఇక్బాల్ నిర్వాహకురాలు అపర్ణను సేవారత్న అవార్డుతో సత్కరించారు. విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకురాలు అపర్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ రామకృష్ణరావు, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్లు బుచ్చేశ్ యాదవ్, రాంచందర్, సిబ్బంది సుధాకర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, వినేశ్, రాజు, సురేందర్, సుజాత, శిరీష పాల్గొన్నారు.

**వృద్ధులకు కొత్త బట్టల పంపిణీ**

నర్సాపూర్ పట్టణంలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఉంటున్న వృద్ధులకు బగిలీస్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ నర్సింగ్ సాగర్ మంగళవారం కొత్త బట్టలను పంపిణీ చేశారు. 50 మంది వృద్ధులకు దసరా కానుకగా బట్టలను పంపిణీ చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అడ్వైజర్ కవిత, సభ్యులు స్వాతి, లక్ష్మణ్, లింగన్న, పారాలీగల్ వలంటీర్ లలిత, ఆశ్రమ నిర్వాహకురాలు అభర్ణ, వృద్ధులు పాల్గొన్నారు.

## ఊర్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి

### ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, అక్టోబర్ 1 : ఊర్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండగ పురస్కరించుకొని పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది తమ సొంత గ్రామాలకు కానీ ఇతర గ్రామాలకు, పట్టణాలకు ప్రయాణాలు చేస్తుంటారని దొంగలు చేతి వాటం ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. దసరా పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మాదిగలకు డప్పులు అందజేత



దంతాన్‌పల్లిలో డప్పులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి

శివ్వంపేట, అక్టోబర్ 1 : శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామంలోని ఎస్సీ మాదిగలకు మండల పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకటరాంరెడ్డి సొంత ఖర్చులతో 30 డప్పులను మంగళవారం అందజేశారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, గ్రామ కమిటీ నాయకులు వెంకట్, రాములు, మధు, గడ్డం రాజు, నర్సింహులు, శివశంకర్, సిద్ధిరాములు తదితరులు ఉన్నారు.

## గంజాయి వదంతులపై విస్తృత సోదాలు

శివ్వంపేట, అక్టోబర్ 1 : మండలంలో గంజాయి వాడుతున్నారనే పుకార్లు చక్కర్లు కొట్టడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో మండలంలోని పలు పరిశ్రమల్లో మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్తృతంగా సోదాలు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ సీఐ నరేందర్ ఆధ్వర్యంలో మండలంలోని సుగుణ పౌల్ట్రీ ఫుడ్స్ కంపెనీలో పనిచేస్తున్న పలు రాష్ట్రాలకు చెందిన కార్మికుల గదుల్లో పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. సోదాలో ఎలాంటి గంజాయి ఆధారాలు లభించలేదన్నారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు.

## మళ్లీ మూతబడిన వనదుర్గమ్మ ఆలయం



అలయం ముందు మంజీరా నదిలో వరద

పాపన్నపేట, అక్టోబర్ 1 : మంజీరా వరదల నేపథ్యంలో ఏడుపాయల వనదుర్గమ్మ అలయం మంగళవారం మూతపడింది. సోమవారం నీటి ప్రవాహం తగ్గడంతో గర్భగుడి తెరిచి పూజలు ప్రారంభించారు. సింగూరు నుంచి 8 వేల క్యూసెక్కుల నీటిని వదలడంతో తిరిగి ఆలయాన్ని మూసివేసి, రాజగోపురంలో ఉత్సహ విగ్రహాన్ని పెట్టి పూజలు చేస్తున్నారు.

## దూర విద్య ప్రవేశాలకు గడువు పొడిగింపు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 1 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ తత్సమాన పరీక్ష పాసైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం కళాశాల అధ్యయన కేంద్రంలో సంప్రదించి ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చున్నారు. డిగ్రీ పూర్తి చేసి పీజీ కోర్సుల్లో చేరాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ప్రవేశాల ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఉంటే కళాశాలలోని దూరవిద్య కో-ఆర్డినేటర్ తిరుమల్ రెడ్డి (7382929698) సంప్రదించాలని సూచించారు.

## రామాయంపేట శివారులో కొండచిలువ సంచారం

### భయాందోళనలో ప్రజలు

రామాయంపేట, అక్టోబర్ 1 : రామాయంపేట పట్టణ శివారులోని ఉన్న వివిధ కాలనీల్లో కొండ చిలువ సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. సోమవారం రాత్రి పట్టణ శివారు ప్రాంతాలైన వేంకటేశ్వర కాలనీ, కేసీఆర్ కాలనీ, హమాలీ కాలనీ ప్రాంతాల్లో సంచరించిట్లు స్థానికులు తెలిపారు. కొండచిలువ సంచరిస్తున్నట్లు తెలియడంతో ఆ ప్రాంతం గుండా కేసీఆర్ కాలనీకి వెళ్లే ప్రజలు భయం, భయంతో వెళ్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని తీవ్ర ఆందోళనకు గరవుతున్నారు. మంగళవారం సంబంధిత అటవీ శాఖ అధికారులకు సమాచారం కూడా చేరవేసినట్లు స్థానికులు తెలిపారు. ముఖ్యంగా కేసీఆర్ కాలనీ మొత్తం అటవీప్రాంతంలోనే ఉండడంతో కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు.

## ఏబీవీపీని బలోపేతం చేయాలి

రామాయంపేట, అక్టోబర్ 1 : ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అఖిల భారత విద్యార్థి పరిషత్‌ను బలోపేతం చేయాలని మెదక్ జిల్లా సంఘటన విభాగ్ కార్యదర్శి లక్ష్మణ్, సిద్దిపేట జిల్లా సంఘటన మంత్రి లక్ష్మిపతి పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేటకు విచ్చేసిన వారు రామాయంపేట నూతన నగర కార్యదర్శిగా భాను, సంయుక్త కార్యదర్శులుగా దీక్షిత్, వంశీ, హరి, పూజలను ఎంపిక చేసి విలేకరులతో మాట్లాడారు. మెదక్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏబీవీపీ కార్యకర్తలకు జిల్లాలో నూతనంగా బాధ్యతలను అప్పగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్ మహిళా కన్వీనర్ నిఖిత, అర్జున్, సోషల్ మీడియా కన్వీనర్ స్వాతిక నితిన్, నవీన్, రమేశ్, జాను తదితరులు ఉన్నారు.

## మాంసం వ్యాపారులకు నోటీసులు

రామాయంపేట, అక్టోబర్ 1: నేడు రామాయంపేటలోని మాంసం వ్యాపారులు మాంసం విక్రయించరాదని విక్రయిస్తే జరిమానాలు విధిస్తామని రామాయంపేట పురపాలిక సిబ్బంది పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ మాంసం విక్ర య వ్యాపారులు చికెన్, మటన్ అమ్మకాలు జరిపే వారు అక్టోబర్ రెండు గాంధీ జయం తి సందర్భంగా మాంసం విక్రయాలను ఒక్క రోజు పాటు అమ్మకాలను నిలిపివేయాలని నోటీసులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, శంకర్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 1 : రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం గౌరవ వేతనం ప్రకటించి, క్వింటాలుకు రూ.300 కమిషన్, రూ. 10 లక్షల బీమా సౌకర్యం ప్రతి రేషన్ డీలర్‌కు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్‌కు లీగల్ నోటీసు

శివ్వంపేట, అక్టోబర్ 1 : తమకు ఒప్పందం ప్రకారం చేస్తామన్న పని చేయకుండా కాలయాపన చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డికి లీగల్ నోటీసు అందజేశామని హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం శివకుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గూడురు గ్రామశివారులోని ప్రధానరోడ్డుకు అనుకొని ఉన్న అతి ఖరీదైన సొంత భూమిని వారి జిన్నారం పెద్దగోని లింగయ్యగౌడ్ జ్ఞాపకార్థం శివ్వంపేట పీఏసీఎస్ భవనం నిర్మాణానికి సొసైటీ చైర్మన్ వెంకటరాంరెడ్డికి ఇచ్చారు. ఇచ్చిన వాగ్దానాన్ని పూర్తి చేయనందున చట్టపరమైన చర్య తీసుకొనుటకు మంగళవారం సొసైటీ చైర్మన్ వెంకటరాంరెడ్డికి లీగల్ నోటీస్ ఇచ్చామని శివకుమార్‌గౌడ్ పేర్కొన్నారు. చట్టపరమైన సివిల్, క్రిమినల్ చర్యలకు వెంకట్రామిరెడ్డి బాధ్యులు అవుతారని ఆయన తెలిపారు.

## అండగా పీఆర్టీయూ

చిలిప్‌చెడ్,అక్టోబర్ 1: మండల పరిధిలోని గౌతంపూర్ ప్రాథమిక పాఠశాలోపని చేస్తున్న శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. శ్రీనివాస్‌కు పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వం ఉన్నందున మంగళవారం చిలిప్‌చెడ్ మండలంలోని చిట్కుల్‌తండాలో పీఆర్టీయూ వెల్ఫేర్ ఫౌండ్ నుంచి మృతుడి కుటుంబ సభ్యులకు రూ. లక్ష చెక్కును మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు అందజేశారు.